నాణ్యమైన విద్యను బోధించాలి

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండలం మారుమూల గ్రామాలైన ఏడుచావాళు, చికుంబంద, కొంతలం, కరకపల్లి పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి బాబూరావు పడాల్ తనిఖీ చేశారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. నాణ్యమైన విద్యను బోధించాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమాలను నిర్వహించి, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. డ్రాపౌట్స్ విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్ద రోప్‌వే నిర్మించగలిగితే మన్య ప్రాంతం రోల్ మోడల్‌గా నిలుస్తుంది

తహశీల్దార్ రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : ఆంధ్రా కశ్మీర్‌గా పేరొంది పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడంతో పాటు శీతల ప్రాంతంగా విరాజిల్లుతూ వేలాది మంది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఎత్తైన ఉమ్మడి ఏజెన్సీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి పెద్ద రోప్ వే నిర్మించ గలిగితే మన్య ప్రాంతం రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా అన్నివిధాలుగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని తహసీల్దార్ టీ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి సహజసిద్ధ వనరులకు, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన అందాలకు ఆలవాల మైన మన్య ప్రాంతం ఉపాధి అవకాశాలకు, ఆర్థికంగా స్థిరపడేందుకు అనేక అవకాశాలున్న ప్రాంతం అన్నారు. ఇటువంటి సహజ సంపద కలిగిన ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధిపరచుకోగలిగితే ఈ ప్రాంత ప్రజానీకానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. నిత్యం శీతల వాతావరణానికి పేరెన్నిక గన్న మన్య ప్రాంతంలో విదేశీ పంటలైన అవకాడో, లిచీ, స్ట్రాబెర్రీ, డ్రాగన్ ఫ్రూట్ తదితర ఎన్నో ఔషధ గుణాలున్న ఫలాలు ఈ ప్రాంతంలో పండుతున్నాయన్నారు. తరతరాలుగా రసాయనాలు వాడకుండా సేంద్రీయ వ్యవసాయం ద్వారా నాణ్యమైన చిరు ధాన్యాల సాగును ఈ ప్రాంత ప్రజలు చేపడుతున్నారన్నారు. రహదారుల అభివృద్ధి లో భాగంగా 516 జాతీయ రహదారి విస్తరణ పనులు చింతపల్లి, లంబసింగి మీదుగానే శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎత్తైన ప్రాంతం కావడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంత అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి రోప్ వే వంటి అత్యాధునిక టెక్నాలజీని అభివృద్ధి పరచి నట్లయితే ఆంధ్రా కశ్మీర్ ప్రాంతమైన లంబసింగి ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోనే రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రారంభానికి నోచుకోని ఏకలవ్య ఆశ్రమ పాఠశాల

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : మన్య ప్రాంతంలో గల గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు మెరుగైన విద్యాభ్యాసం కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏకలవ్య ఆశ్రమ పాఠశాలలను నిర్మాణ ప్రక్రియకు ఆయా ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టాయి. అయితే కొన్నిచోట్ల ఏకలవ్య పాఠశాలలు నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నప్పటికీ దుంబ్రిగూడ మండల కేంద్రంలోని 12 కోట్ల వ్యయంతో ఏకలవ్య ఆశ్రమ పాఠశాల నిర్మాణం ప్రారంభానికి పరాకాష్టగా సాగుతుంది. 2013-14లో పాఠశాల నిర్మాణం ప్రారంభమై సుమారుగా 10 ఏళ్ళు కావస్తున్న ఇక్కడి ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణం పూర్తి దశలో చేరుకోలేదు. కేంద్ర నిధులతో చేపడుతున్న ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాని గతంలోని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారులు ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించి పాఠశాల భవన నిర్మాణంలో అలసత్వం కాకూడదని వేగవంతంగా భవన నిర్మాణం చేపట్టి గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు భవన నిర్మాణ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేసిన సందర్భాలు అనేకమని మండల ప్రజలు చెబుతున్నారు. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాలను బేకాతర చేస్తూ నత్త నడకగా పాఠశాల భవన నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు చేపడుతున్నారని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి మండల కేంద్రంలో నిర్మాణం చేపడుతున్న ఏకలవ్య ఆశ్రమ పాఠశాల ను పూర్తి దశలో చేరే విధంగా చర్యలు తీసుకొని గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

శ్రద్ధతో విద్యాభ్యాసం పొందాలి : సర్పంచ్ సునీత

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : ఉపాధ్యాయులు బోధించే విద్యను విద్యార్థిని, విద్యార్థులు శ్రద్ధతో అలవర్చుకుంటేనే ఉన్నత భవిష్యత్తుకు దోహదపడుతుందని గసభ సర్పంచ్ పాంగి. సునీత విద్యార్థిని విద్యార్థులకు హిత బోధించారు. గసభ పంచాయతీ మొర్రిగూడ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక కొన్నత పాఠశాలలో గల ఆరు ఏడు తరగతుల విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు నోటి పుస్తకాలు శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు బోధించే విద్యా బోధనలను క్రమశిక్షణగా అలవర్చుకోవాలని తద్వారా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు నివ్వాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగం, ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ పి.సురేష్ పాఠశాల చైర్మన్ దొరబాబు, ఉపాధ్యాయులు పౌలు, విశ్వనాథం ,రాజు, గురుమూర్తి వార్డ్ మెంబర్ సత్యనారాయణ రాజ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దోమ కారక వ్యాధులపట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఆర్ ఐటిఐ కళాశాలలో దోమల మందు పిచికారి పనులు
ఆర్‌వి నగర్ వైద్యాధికారిని సౌమ్య

విశాలాంధ్ర-చింతపల్లి : దోమ కారక వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వి నగర్ వైద్యాధికారిణి కె.సౌమ్య అన్నారు.అల్లూరి జిల్లా ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా ఆదేశాలమేరకు శనివారం స్థానిక ఆర్‌ఐటిఐ వసతి గృహంలో దోమల మందు పిచికారి పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సౌమ్య మాట్లాడుతూ గడిచిన వారం రోజులుగా మన్యంలో అడపాదడపా కురుస్తున్న వర్షాల దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రభుత్వం దోమల మదు పిచికారి పనులను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగానే వసతి గృహాలలో పిచికారి పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల పాఠశాలల, కళాశాలలు, ఆశ్రమ వసతి గృహాలలో పిచికారి పనులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు చిన్నపాటి రుగ్మతలు తలెత్తితే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వసతి గృహ అధికారులు వెంటనే స్పందించి సమీపంలోని ఆసుపత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు వసతి గృహాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు సంబంధిత వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో జాన్సన్, ఏఎన్ఎం కే విజయలక్ష్మి, ఆశా కార్యకర్త కే రాజేశ్వరి, అంగన్వాడి కార్యకర్త బి.నూకరత్నం, పిచికారి సూపర్వైజర్ నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-జిమాడుగుల : మండలంలో నుర్మతి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు అంబిడి శ్యామసుందరం ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ తల్లే సూరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు బ్యాగుల అందచేశారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య కమిటీ చైర్మన్ వనబంగి మత్స్యకొండబాబు, ఎంపీటీసీ అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించండి : ఐటిడిఏ పిఓ

విశాలాంధ్ర-జి.మాడుగుల : ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించి నాణ్యమైన విద్యను అందించాలని ఐటిడిఏ పి.ఓ, వి. అభిషేక్ ఆదేశించారు. శనివారం నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు, బొయితిలి బాలురు ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థుల హాజరు పట్టీలను తనిఖీ చేసారు. ఎంత మంది పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్దులు చర్మ వ్యాదులతో బాధపడుతున్నారని గుర్తించి, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్‌తో మాట్లాడి తగిన వైద్యం అందించాలని ఆదేశించారు. చర్మవ్యాదులు రాకుండా పరిశుభ్రంగా ఉండాలని విద్యార్దులకు సూచించారు. వేడి నీటితో బట్టలు ఉతకాలని అన్నారు ఆశ్రమ పాఠశాలలో విద్యార్దుల మొత్తం ఎంత మంది ఉండాలి ? ఎంత మంది హాజరు కాలేదని ఉపాధ్యాయులను ప్రశించారు. సికిల్ సెల్ ఎనిమియా లక్షణాలు ఉన్న విద్యార్దులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తలిదండ్రులు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్దులకు సూచించారు. ప్రతీ విద్యార్ధి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలో చూసిరాతలకు అలవాటు పడకూడదని విద్యార్దులకు సూచించారు. పది తరువాత ఏం చదువుతారని విద్యార్దులను ప్రశించారు. ఇంటర్మీడియట్ చదువుతామని విద్యార్దులు జవాబిచ్చారు. ఆతరువాత డిగ్రీలో చేరి బాగా చదువుకోవాలని చెప్పారు. అనంతరం 10 వతరగతి విద్యార్దులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలు బోధించారు. సాంఘిక శాస్త్రంలో పాఠాలు బోధించి పాఠ్యాంశంలోని ప్రశ్నలు వేసి జవాబులు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడి ప్రతీ విద్యార్ధి పాఠశాలకు హజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతీ విద్యార్ధి పాఠశాలలోనే ఉండాలన్నారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి పాఠశాలకు తీసుకుని రావాలన్నారు. మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకోవాలన్నారు. 10 వతరగతిలో ఎంత మంది విద్యార్దులున్నారని అడిగి తెలుసు కున్నారు. పది విద్యార్దులపై ప్రత్యేక శ్రద్ద పెట్టాలని స్పష్టం చేసారు. గిరిజన విద్యార్దులకు నాణ్యమైన విద్య అందించాలని చెప్పారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులందరికి సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ

జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: అర్హులైన లబ్దిదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులు, జిసిసి డివిజనల్ మేనేజర్లు, ఎం ఎల్. ఎస్. పాయింట్ ఇన్చార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ నెలా 30వ తేదీ నాటికి నిత్యావసర సరుకులు సంబంధిత స్టాక్ పాయింట్లకు చేరవేయాలని సూచించారు. బియ్యం నిల్వలలో చీడ పీడలు లేకుండా కార్డుదారులకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని స్పష్టం చేసారు. ఎం. ఎల్. ఎస్ పాయింట్లను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్యాక్ చేయబడిన వస్తువుల బరువులు ఖచ్చితత్వాన్ని ధృవీకరించడానికి తగిన యంత్ర పరికరాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఎం. ఎల్. ఎస్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిత్యావసర సరకులు అన్లోడ్ చేస్తున్నప్పుడు అలాగే పంపిణీ చేసే సమయంలో సరుకులు గడువు తేదీని నోట్ చేసుకోవాలని పేర్కొన్నారు. వస్తువులు నిల్వ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. లబ్దిదారులకు సరుకులు పంపిణీలో తూకం సక్రమంగా ఉండాలని అన్నారు. పంపిణీ చేసిన సరుకుల్లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిత్యావసర సరుకులు వృధా చేయకూడదని అన్నారు. జి.పి. ఎస్ సిస్టం ఉన్న వాహనాలలో సరుకులు రవాణా చేయాలని చెప్పారు. నిత్యావసర సరుకులు పంపిణీ కి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఐసిడి ఎస్కు ఎం. డి. యు వాహనాలకు సరుకులు పంపిణీ చేసేటప్పుడు స్టెన్సిలింగ్ చేయాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సి. శ్రీహరి, డి. ఎం. గణేష్ జి.సిసి డి. ఎంలు, ఎం. ఎల్. ఎస్ పాయింట్లు ఇన్చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

మన్యంజిల్లా కేంద్రంలో ఘనంగా విశాలాంధ్ర 72వ వార్షికోత్సవ వేడుకలు

- ముఖ్యఅతిథులుగా పార్వతీపురం పురపాలక సంఘ కమిషనర్, డిపిఆర్ఓ, ప్రముఖ కథారచయిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పట్టణ ఎస్ఐ, ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు
- పేదలపక్షాన నిలిచే పత్రికగా విశాలాంధ్రను కొనియాడిన వక్తలు

విశాలాంధ్ర-పార్వతీపురం/టౌన్/బెలగాం : ప్రతీక్షణం ప్రజలకోసం ఆలోచన చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నత కోసం విశాల దృక్పథంతో వార్తలను రాస్తున్న విశాలాంధ్ర దినపత్రిక 72 వార్షికోత్సవాలు పూర్తిచేసుకోవడం ఎంతో ఆనందదాయకమని పార్వతీపురం పురపాలక సంఘం కమిషనర్ కోనా శ్రీనివాసరావు, డిపిఆర్ఓ లోచర్ల రమేష్, ప్రముఖకవి, కథారచయిత గంటేడ గౌరు నాయుడులు తెలిపారు. శనివారంనాడు విశాలాంధ్ర 72వ వార్షికోత్సవ వేడుకలను పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. 72వ వార్షికోత్సవం సందర్భంగా కేకునికోసి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. 1952లో ప్రారంభమైన విశాలాంధ్ర అన్నివర్గాల వారికి సుపరిచితమైన పత్రికని, ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఎదుర్కొని నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. ఒక్కరోజు కూడా ఆగకుండా పత్రికను నడపడం నిజంగా నేటి పోటీ ప్రపంచంలో కూడా విశాలాంధ్ర దీటుగా నిలబడి పనిచేయడం గర్వించదగ్గరన్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర విభజనలో విశాలాంధ్ర పత్రిక పాత్ర ఎంతో ఉందన్నారు. విశాలాంధ్ర పేదల పక్షాన నిలిచే పత్రికని, ఫోర్త్ ఎస్టేట్ గూర్చి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, పార్వతీపురం పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ బి.రవీంద్రరాజులు వివరించారు. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల ప్రాధాన్యతను వారు వివరించారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు కీలకమైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. విశాలమైన హృదయం కలిగిన పత్రికగా విశాలాంధ్రకు, విశాలాంధ్ర పత్రిక విలేకరులకు పేరుందన్నారు. ఈకార్యక్రమంలో విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిని రమేష్, సిపిఐ నాయకులు, ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష,కార్యదర్శులు కిషోర్ కుమార్, గంగి శ్రీనివాసరావు, కోశాధికారి సాలాపు అనంతరావు, పార్వతీపురం పట్టణ విశాలాంధ్ర విలేకరులు వానపల్లి శంకర్రావు, సాలాపు అనంతరావు, అగ్రిగోల్డ్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షులు ఈవినాయుడు, ఎల్‌టిపి జిల్లా అధ్యక్షులు జయకృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, విశాలాంధ్ర విలేకరులు నెల్లి శ్రీనివాసరావు (కురుపాం), కరణం సత్యనారాయణ (మక్కువ), డొల్లు మన్మధరావు (కొమరాడ), కాంతారావు (పాలకొండ), వెంకటేష్ (సీతంపేట), చినగుడబ చంద్రమౌళి (గరుగుబిల్లి), ఇతర విలేకరులు ఎస్. గౌరిశంకర్ (ఆంధ్రజ్యోతి), పి.పురుషోత్తం (ప్రజాశక్తి), చెవిటి వెంకటరమణ (ప్రజాశక్తి), సత్యానంద్ (అక్షర సూర్య), అట్ల దివాని (జర్నలిస్ట్ పవర్) తదితరులతోపాటు పురపాలక కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బడిలో ఉండాలి

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలో గల చిన్నబగ్గ, పూతికవలస ఆశ్రమ పాఠశాల పరిధిలో "నేను బడికి పోతా" కార్యక్రమం గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ అన్న దొరై ఐటీడీఏ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయడు నిర్వహించారు. పిల్లలు బడిలో, పెద్దలు పనిలో అనే నినాదాలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. ఏఎంఓ కోటిబాబు, సీఎంవో చిరంజీవులు తదితరులు గ్రామాల్లో పర్యటించి డ్రాప్ ఔట్ విద్యార్థులు లేకుండా అందరినీ పాఠశాలలో చేర్పించే బాధ్యత అందరూ తీసుకోవాలని తెలియజేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, శారద ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ఇరువురికి గాయాలు

విశాలాంధ్ర-చింతపల్లి : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇరువురు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మన్య ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న 516 జాతీయ రహదారి విస్తరణ పనులులో భాగంగా చిప్స్ మెటల్ వేయడం, వాహన దారులు సైతం అతి వేగంగా వాహనాలను నడపడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి . ఈ క్రమంలో శనివారం చింతపల్లి నుండి లంబసింగి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో చింతపల్లి నుండి లంబసింగి వైపు వెళ్తున్న వాహనంపై ఉన్న ఇరువురు గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులకు అటువైపు గా వెళుతున్న ప్రయాణికులు సపర్యలు చేసి వైద్య సేవల నిమిత్తం చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వరహాల గెడ్డ ఆక్రమణ పనులు తొలగించి, పూడికల పనులు చేపట్టాలి

మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణ పరిధిలోని వరహాలగెడ్డ, చెరువుల ఆక్రమణల బ్రిడ్జి పనులను తొలగించి, పూడికల తీసివేతల పనులు చేపట్టాలని సిపిఎం పార్వతీపురం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం పట్టణ కమిటీ శనివారం వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను, గెడ్డ పూడికలను పరిశీలిన అనంతరం పార్వతీపురం ఆర్డిఓ డిటి జెపి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాసరావులకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు బంకురు సూరిబాబు మాట్లాడుతూ పార్వతిపురం పట్టణంలో చిన్న పాటి వర్షం పడినా ముంపు భారిన పడుతుందని దీనికి ప్రధాన కారణం పట్టణం మధ్యలో ప్రవహిస్తున్న వరహాలగెడ్డ ఆక్రమణలేనని తెలిపారు. ఈ ఆక్రమనల తొలగింపునకు అధికారులకు అనేక పర్యాయాలు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని మండిపడ్డారు. వెంటనే వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించాలని, అలాగే వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కాజ్ వే పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అలాగే వర్షాకాలం సందర్భంగా గెడ్డ పూడికలు తొలగించే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరహాల గెడ్డ వరదల వల్ల పార్వతిపురం పట్టణం తరచు ముంపులకు గురవుతున్నందున పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఈ ముంపు బారి నుండి పార్వతీపురం పట్టణ ప్రజలను రక్షించాలని డిమాండ్ చేశారు. లేని యెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పి. రాజశేఖర్, హెచ్. బలరాం, బెలగం శ్రీనివాసరావు, సీరియర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి : డిఎంఓ

విశాలాంధ్ర-బెలగాం : చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. పట్టణంలో 7వ వార్డు అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ మధ్యకాలంలో పిల్లల్లో ఎవరికైనా జ్వరాలు, సీజనల్ వ్యాదులు నమోదు అయ్యాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో మరియు పరిసరాల్లో శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాల్లో ప్రస్తుత సీజన్లో డెంగ్యూ జ్వరాలకు ఆస్కారం ఉన్నందున జ్వర లక్షణాలను గుర్తిస్తే వెంటనే జిల్లా ఆసుపత్రిలో డెంగ్యూ నిర్ధారణ కేంద్రంలో (ఎస్ఎస్ హెచ్)పరీక్షలు జరిపించాలన్నారు. అదేవిధంగా జ్వర లక్షణాలను బట్టి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. చిన్నారుల త్రాగు నీరు పరిశుభ్రంగా ఉండాలని, ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య నిర్వహణ రికార్డులో బరువు, ఎత్తు, శారీరక ఎదుగుదల వివరాల నివేదికలు పరిశీలించి, వాటి సాధారణ, అసాధారణ స్థితిని అక్కడ స్వయంగా పిల్లల బరువు తనిఖీ చేసి సరిచూశారు. ప్రతీ నెలా పురోగతి లేనట్లు గుర్తిస్తే ఎన్‌ఆర్సి కేంద్రంలో చేర్చాలన్నారు. వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పిల్లల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అనంతరం డిఎంఓ డ్రైడే కార్యక్రమం ఏమేరకు నిర్వహిస్తున్నారో వార్డులో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సూర్యనారాయణ, ఎఎన్ఎం కిరణ్మయి, అంగన్వాడీ టీచర్ లత, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విశాలాంధ్రకు శుభాకాంక్షలు తెలియజేసిన మండల అధికారులు, నాయకులు

విశాలాంధ్ర-సీతానగరం : విశాలాంధ్ర 72వ వార్షికోత్సవాన్ని శనివారం పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఘనంగా చేసుకోగా సీతానగరం మండలానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీవార్తను తప్పనిసరిగా రాసే విశాలాంధ్ర విశాల హృదయం కలిగిన పత్రికగా తెలియజేస్తూ పత్రిక విలేకరులకు అభినందనలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంపీడీవో ఈశ్వరరావు, పరిపాలనాధికారి ప్రసాద్, మండల పంచాయతీ విస్తరణ అధికారి వర్మ, వ్యవసాయఅధికారి అవినాష్, ఎంఈఓ సూరిదేముడు, పెదంకలం వైద్యురాలు రాధాకాంత్, ఎస్సై ఎం.రాజేష్, ఆర్డబ్ల్యూఎస్ జెఈ పవన్ కుమార్, ఇరిగేషన్ జెఈ శ్రీనివాస రావు,ఉపాధి హామీపథకం ఏపీఓ భాను, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కృష్ణారావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీపథకం సిబ్బంది తదితరులున్నారు. వారితోపాటు వైఎస్‌ఆర్సిపి మండలపార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములునాయుడు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్, పలుగ్రామాలు సర్పంచులు, పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డెస్క్ కార్యక్రమాలు నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని ఇంటర్నేషనల్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శనివారంనాడు డాన్ టూ డెస్క్ (ఉదయాస్తామాన సేవలు) కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఏడురకాల సేవలుఅందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక శ్రీవేణుగోపాలస్వామి అర్చకులు శ్రీనివాసాచార్యులకు చీర, పంచె, దోవతులను అందజేశారు. 40మంది పేద పిల్లలకు పుస్తకాలను, పెన్నులను, బిస్కెట్ల ప్యాకెట్లు అందజేశారు. సీతానగరం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 21మంది పోలీస్ సిబ్బందికి ఎస్సై ఎం.రాజేష్ సమక్షంలో రుమాల్లు, పెన్నులను అందజేశారు. సీతానగరం కేంద్రంలోని వీధివ్యాపారులకు పెద్దగొడుగులను అందజేశారు. సీతానగరంలోని తోపుడుబల్లుకు పెయింటింగ్ వేయడంతోపాటు ఐదుగురు చేత నేత్రదానం చేయడానికి అంగీకారం పత్రాలు అందజేసారు. ఈకార్యక్రమంలో అంతర్జాతీయ వాసవి క్లబ్ మాజీ ప్రెసిడెంటు కె.పాపారావు (గొల్లప్రోలు), వాసవీ క్లబ్ ప్రెసిడెంటు ఆరిశెట్టి గోవిందరాజులు, సెక్రెటరీ కూర్మదాసు లక్ష్మణరావు, కోశాదికారి కె.వెంకటరాజు, రీజనల్ సెక్రటరీ ఏవి సత్యనారాయణ, ఐపిసి మమ్ముల విశ్వేశ్వరరావు, వాసవీ క్లబ్ సభ్యులు కె.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, గ్రంధి శ్రీనివాస్, ఎం.నారాయణరావు, కె.వాసు, దేవుడు,రాజు, సర్వేశ్వరరావు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలో వాసవి క్లబ్ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహిస్తున్నామని అధ్యక్ష, కార్యదర్శి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురుకి గాయాలు

విశాలాంధ్ర-కురుపాం/గుమ్మలక్ష్మీపురం : మండలం వనకాబడి, కుశ, చెంబుగూడా గ్రామానికి చెందిన సుమార్ 8 మంది వ్యక్తులు కొమరాడ మండలో జరిగిన వివాహనికి వెళ్ళి వస్తుండగా ఒడ్డిస్సా రాష్ట్రం సంపీ, దుర్గపాడు సమీపంలో ఆటో బోల్తా పడటంతో కుశ గ్రామానికి చెందిన హరీష్, వనకాబడి గ్రామానికి చెందిన పువ్వల అనీల్, చెంబుగూడ గ్రామానికి చెందిన మారుతీకి గాయాలు అయ్యాయి. వెంకటే కురుపాం ఆసుపత్రికి తీసుకురాగా ప్రథమ చికిత్స నిర్వహించి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసారు.

పోలీస్ అవుట్ పోస్టలను ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-జిమాదుగుల : మండల కేంద్రంలో శనివారం జిమాదుగుల పోలీస్‌స్టేషన్ నర్మతి అవుట్ పోస్టలను అకస్మాత్తుగా పాడేరు ఏఎస్పి ధీరజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరు తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన అన్నారు అదేవిధంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు జి మాడుగులలో నిర్మిస్తున్న బేరక్ లను పరిశీలించారు ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రమేష్, 198బీఎన్ ఇన్స్పెక్టర్ రవి ఏపీఎస్‌పీ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర

పేజి : 2

- అల్లూరి సీతారామరాజు
- పార్వతీపురం మన్యం

ఆదివారం 23, జూన్ 2024

మాదకద్రవ్యాలపై ఎస్సై శివకుమార్ అవగాహన

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, చింతూరు సబ్ డివిజన్ ఇంచార్జ్ ఏఎస్‌పి కె.వి మహేశ్వర్‌రెడ్డి, చింతూరు సిఐ ఎం గజేంద్ర కుమార్ ఆదేశాలమేరకు డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న డొంకరాయి జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ గిరిజన బాలికల హైస్కూల్, మంగంపాడు ప్రభుత్వ గిరిజన బాలల హైస్కూల్‌లో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకుమార్ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) సేవించడం వల్ల మనుషులు సైకోల్లామారి, వికృత చేష్టలతో మృగంలా మారతారని తెలిపారు. గంజాయి సేవించడం బ్రెయిన్ ఫంక్షనింగ్ దెబ్బతింటుందని, కంటి చూపు మందగిస్తుందని, గుండే సమస్యలు వచ్చి, చర్మ వ్యాధులు వస్తాయని తెలిపారు. అందువల్ల గంజాయి వంటి మాదకద్రవ్యాలు పండించడం, రవాణా చేయడం, సేవించడం చట్టరీత్యా నేరం అని తెలిపారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన పెంచుకొని తెలియనివారికి చెప్పి అందరినీ అవగాహన కల్పించాలని కోరారు. డొంకరాయి జడ్పీ హైస్కూల్‌లో పెట్టిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీటీసీ కె.వి.రమణ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో ఇరుక్కుంటే కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని, బెయిల్ పెట్టుకోలేక చాలామంది జైల్లలోనే ఉండిపోతున్నారని తెలిపారు. అందువల్ల గంజాయి వంటి మాదక ద్రవ్యాలు జోలికి వెళ్తే మైనర్ అయినా మేజర్ అయినా కేసులు నమోదు అవుతాయని, నేరానికి తగిన శిక్ష ఖచ్చితంగా అనుభవిస్తారని తెలియజేశారు.

ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

ముందుగా మండలంలో ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలి

సిపిఎం కమిటీ డిమాండ్

విశాలాంధ్ర-సాలూరు టౌన్ : ఆశ్రమ పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు పై దృష్టి సారించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్.వై నాయుడు సూచించారు. శనివారం సిపిఎం కార్యాలయంలో పత్రిక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయడు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ప్రారంభిస్తున్నట్టుగా ఈనెల 20వ తేదీన డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ వారు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. సాలూరు పట్టణంలో ఉన్న ఆశ్రమ పాఠశాలన్నీ ముందుగా ప్రారంభించాలి అని అన్నారు.అందులో రానున్నది వర్షాకాలం కాబట్టి బాలికల,బాలుర, పాఠశాలలో ఉన్న బాత్రూం, కిటికీలు, ప్రహరీ గోడ ఇలాంటి మౌలిక వసతులను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కారం చేయాలని తెలియజేశారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్ ను నియమించాలి. సాలూరు మండలం రామస్వామి వలస గ్రామంలో ఉన్న జిపిఎస్ పాఠశాలను గతంలో మూసి వేయబడింది.తిరిగి మరల జిపిఎస్ పాఠశాలను ప్రారంభించి ఉపాధ్యాయులను నియమించాలని అన్నారు. ప్రతి ఆశ్రమ పాఠశాలలో పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముఖ్యంగా ఏఎన్ఎంలు నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కమిటీ సభ్యులు టి.రాము,టీ. ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించడమే టీడీపీ లక్ష్యం

- కారం వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-ఎటపాక : విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించడమే టీడీపీ పార్టీ లక్ష్యమని ఎటపాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో గల సిఎస్ఐ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, బట్టలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆదేశాలమేరకు అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముప్వా శ్రీనివాస్ నేతృతంలో శనివారం పేద విద్యార్థులకు ఎటపాక గ్రామపంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు అందించారు. ఈ సందర్భంగా కారం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేయడం జరిగిందని, దాని కోసమని చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి సంవత్సరానికి 15000 చొప్పున అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్రని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దేనేని వెంకటేశ్వర్లు, పసుపులేటి రాంబాబు, అనుగోజ్ మురళి, రామకృష్ణ, సిసం వెంకటేశ్వర్లు, గోసుల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-గంగవరం : మండలం గంగవరం సచివాలయం ఆర్‌బికె పరిధిలో అలాగే కొత్తాడ రైతు భరోసా కేంద్రంలో రైతులకు ధాన్యం విత్తనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగ మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 90 శాతం సబ్సిడీతో రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి కే విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి 1300 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలు రావడం జరిగిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30 కేజీల విత్తనాలను 130 రూపాయలకు అందించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే గంగాదేవి,, ఆముదాలబంధ ఎంపీటీసీ వండా ఆదినారాయణ దొర,గంగవరం మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, టిడిపి పార్టీ మండల అధ్యక్షుడు పాము అర్జున, సర్పంచ్ కలుముల అక్కమ్మ కొత్తాడ సర్పంచ్ సారపు కామరాజుదొర,ఆముదాలబంద సర్పంచ్ అక్కమ్మ, గంగవరం బూత్ ఇన్చార్జులు కోసు బుల్లియమ్మ, సారపు సత్యవేణి, కృష్ణమూర్తి దొర, కుంజం వెంకటేశ్వర్లు దొర, మడకం రామారావు దొర, కోసు తమ్మన్నదొర, కారం ప్రసాద్ దొర, కారం రాజ్‌కుమార్ దొర, కలుముల వెంకన్న దొర, కుంజం వెంకన్నదొర, సవలం చెల్లన్నదొర, కృష్ణ, స్వర్ణ, పామర్తి వీరబాబు, సింహాద్రి రాంబాబు, బండి చిన్న వెంకటరమణ దొర, కమ్మరి రాంబాబు, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఎంఏఓ రాంబాబు, వి ఎస్ ఏ రెహానా సుల్తాన్, విఎస్ఏ గ్రేస్, కొత్తాడ సెక్రెటరీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయాలకు నిర్వహణ గ్రాంట్ విడుదల చేయాలి

ఎంఈవో-1, అసోసియేషన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-పార్వతీపురం : మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్ (ఎంఆర్సీ గ్రాంట్) ను విడుదల చేయాలని మండల విద్యాశాఖ అధికారులు-1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రవినాయక్లు విజ్ఞప్తి చేశారు. మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్ కు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా నారా లోకేష్ పదవీ బాధ్యతలు స్వీకరించడం పట్ల ఎంఈవో-1 అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. ఎంఈఓ కార్యాలయాల నిర్వహణకు ప్రతి ఏడాది ఎంఆర్సీ గ్రాంట్ సమగ్ర శిక్ష ద్వారా మంజూరు చేస్తారని, అయితే గత విద్యా సంవత్సరం 2023-24 నుండి నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో ఎంఈఓలు ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఆఫీసు నిర్వహణకు సంబంధించిన విద్యుత్ ఛార్జీలు, ఇంటర్నెట్ చార్జీలు, స్టేషనరీ ఖర్చులతో పాటు వివిధ విద్యా కార్యక్రమాల నిర్వహణకు ఎంఈఓ లు స్వంత డబ్బులను వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఈ సమస్య ను విద్యామంత్రి దృష్టికి లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేశామన్నారు. విద్యావంతులైన,సమర్థత కలిగిన నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా రంగం మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించడం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-పాచిపెంట : పత్తి పంట ప్రస్తుతం 15 నుండి 25 రోజుల వయస్సు ఉందని రైతులు సరియైన విధానంలో ఎరువులతో పాటుగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు .మాతుమూరు రైతు భరోసా కేంద్రం పరిధిలో పత్తి పంటను పరిశీలించారు ప్రస్తుతం రైతులు ఎక్కువగా బీటీ రకాలను పండిస్తూ ఉండడం వలన రసం పీల్చు పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని ముందుగా ఐదు శాతం వేప కషాయం లేదా వేప నూనె ఒక లీటర్ నీటికి ఐదు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. భూమిలో సరి అయిన తేమ లేకపోవడం వలన రైతులు ఎరువులు వేయడం ఆలస్యం చేస్తున్నారని డిఏపి లేదా కాంప్లెక్స్ ఎరువులను ఆఖరి దుక్కిలోనే వేసేయాలని అలా వెయ్యని ఎడల వేరు వ్యవస్థ సరిగా అభివృద్ధి చెందదని ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపిస్తుందని తెలిపారు. సరియైన ప్రేమ శాతం ఉన్నప్పుడు రైతులు డీఏపీ 25 కిలోలు యూరియా 25 కిలోలు పొటాష్ 15 కిలోలు ఒక ఎకరాకు వేసుకోవాలని సూచించారు అక్కడక్కడ కాండం తొలుచు వీవిల్ పురుగు నష్టం కనిపిస్తుందని నివారణకు కార్బో ఫిరాన్ గుళికలు వేసుకోవాలని వీలైనంత త్వరగా మొదటి దఫా ఎరువులు వేసుకోవాలని తెలిపారు రైతు భరోసా కేంద్రాలలో యూరియా డిఏపి మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

అంపశయ్యపై ఏజెన్సీ విద్య

ప్రభుత్వ టీచర్ల పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో....

ఏజెన్సీలో అడుగంటిన విద్యా ప్రమాణాలు

విశాలాంధ్ర-కూనవరం... నవ సమాజాన్ని అత్యున్నతమైన విలువలతో నైపుణ్యంతో నిర్మించే ప్రక్రియలో మొదటి వ్యక్తి ఉపాధ్యాయుడు. అలాంటి ప్రభుత్వ ఉపాధ్యాయుడే తనపిల్లలక్కూడా తాను పాఠాలు చెప్పుకోవడం చేతకాక ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టి మరీ చదివించుకునే దుస్థితిలో ఉన్నాడంటే జాలిపడాలో బాధపడాలో అర్థంకాని పరిస్థితి ఏజెన్సీలో నెలకొంది. ముఖ్యంగా ఏజెన్సీ విలీన మండలాల్లో 90 శాతం మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు పదవ తరగతి వరకు తమ పిల్లల్ని ప్రైవేట్ స్కూళ్లలోనే చదివిస్తున్నారు అంటే ప్రభుత్వ బడుల్లో చదువు ఏపాటి నాణ్యత ఉందో ఇంతకంటే ఉదాహరణ అక్కర్లేదు. ఇక్కడ పట్టుమని పది ఎక్కాలు కూడా సరిగ్గా చెప్పలేని పదవ తరగతి విద్యార్థులని గవర్నమెంట్ స్కూల్లోచూడొచ్చంటే అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితిని అదుపు చేయగలిగే అధికారులు లేకపోవడం, ఇక్కడ ప్రభుత్వ టీచర్లకు చిత్తశుద్ధి లేకపోవడం మా పిల్లల పాలిట శాపం అని ప్రైవేట్ స్కూళ్లలో చదివించలేని పేద తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు.ఏజెన్సీ లో 100% ఉద్యోగాలు మాకే కావాలని డిమాండ్ చేసే ఉపాధ్యాయ సంఘాలు మరి ప్రభుత్వ టీచర్లు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో ఎందుకు చదివించుకోవట్లేదని ఆలోచించకపోవడం అత్యంత దౌర్భాగ్యం. రాజకీయ లబ్ధి కోసం ఉద్యోగాలు మాత్రమే కావాలి కానీ విద్యా ప్రమాణాలతో మాకు పనిలేదు అంటే రాబోయే భవిష్యత్ తరాలు డిగ్రీ పట్టాలు పట్టుకొని ఏ బస్సు ఏ ఊరు వెళ్తుందో కండక్టర్ ని అడిగే దుస్థితి రాక మానదు.ఇది భవిష్యత్తు సమాజానికి పెను ప్రమాదం. ఈ విషయంపై ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ బడులను కాపాడుకుందాం అనే ప్రచారం కంటే, ముందు ప్రభుత్వ టీచర్లకు కౌన్సిలింగ్ ఇవ్వాలని వారి పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించడం ద్వారా మార్పుకి నాంది పలకాలని ప్రజల కోరుతున్నారు.

పోటీ చేసిన అన్ని స్థానాలలో విజయం సాధించడం చరిత్ర

- 21 స్థానాలు సాధించడమే గాక 21వ తారీఖునే ప్రమాణ స్వీకారం చేయడం యాదృచ్ఛికం

- జనసేన మండల అధ్యక్షుడు బుజ్జిబాబు

విశాలాంధ్ర-చింతపల్లి : 2019లో ఒక స్థానంతో సరిపెట్టుకున్న జనసేన పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన 21 స్థానాలకు విజయం సాధించడమే గాక శతశాతం స్ట్రైక్ రేట్ సాధించడం రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమమని జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ఏర్పాటులో కీలక భూమిక పోషించిన జనసేనాని పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టిన నాటి నుండి అనేక అవమానాలకు గురైనప్పటికీ ప్రజాసేవ చేయాలన్న ఏకైక లక్ష్యంతో 2019 సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసి ఒకే ఒక్క సీటు గెలవడం జరిగిందన్నారు. ఆ తరువాత కూడా ఎన్నో అవమానాలకు గురైన ఆయన అవమానాలకు కుంగిపోకుండా రెట్టించిన ఉత్సాహంతో ప్రజాసేవకై పరితపిస్తూ గడచిన ఐదేళ్ల వైకాపా పరిపాలనను ఎండగట్టారన్నారు. వైకాపా వంటి నియంతృత్వ నిరంకుశ పరిపాలనకు చరమగీతం పాడాలన్న ఏకైక లక్ష్యంతో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని తెదేపాలతో జతకట్టి కూటమిని ఏర్పాటు చేశారన్నారు. పార్టీలో అధిక సీట్లు తీసుకోవడం కంటే తీసుకున్న సీట్లలో ఎక్కువ సీట్లలో విజయం సాధించాలన్న లక్ష్యంతో జనసేనాని పవన్ కళ్యాణ్ పనిచేసారన్నారు. ఆయనలో ఉన్న చిత్తశుద్ధి ఎన్డీఏ కూటమి విజయానికి దోహద పడిందన్నారు. కూటమిలో భాగంగా జనసేన తీసుకున్న 21 స్థానాలకుగానూ అన్ని స్థానాలలో విజయం సాధించి 100% స్ట్రైక్ రేట్ సాధించడం చరిత్ర అన్నారు. అంతేగాక అదే 21వ తేదీన అసెంబ్లీలో అడుగుపెట్టడం, ప్రమాణ స్వీకారం చేయడం యాదృచ్ఛికం అన్నారు. జనసేన పార్టీని అవహేళన చేసిన ప్రతి ఒక్కరికి కూటమి విజయం, అందులోనూ జనసేన పోటీ చేసిన అన్ని స్థానాలలో విజయం సాధించడం వైకాపాకు చెంపపెట్టు అన్నారు.

విద్యుత్ వినియోగదారులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారమే తమ లక్ష్యం

- విద్యుత్ సమస్యలు ఉంటే 1912 కు ఫిర్యాదు చేయండి

- కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెస్సల్ ఫోరం చైర్మన్ డాక్టర్ బి సత్యనారాయణ



విశాలాంధ్ర-చింతపల్లి : విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సి జి ఆర్ ఎఫ్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిజిఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో సిజిఆర్ఎఫ్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం యొక్క విధివిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1912 (కాల్ సెంటర్)కి ఫోన్ చేసి ఫిర్యాదులు తెలియజేసుకోవచ్చని, సమస్యలు పరిష్కారం కానీ ఎడల ఆ సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేస్తూ "చైర్మన్ కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెస్సల్ ఫోరం (సిజిఆర్ఎఫ్), ఏపీ ఈపీడీసీఎల్, కార్పొరేట్ కార్యాలయం, విశాఖపట్నం కు పోస్ట్ ద్వారా తెలియపరచవచ్చని, ల్యాండ్ లైన్ నెంబర్ 08942 2564704 నెంబర్ కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చని తెలిపారు. సిజిఆర్ఎఫ్ సాంకేతిక సభ్యులు వి జనార్ధన రావు మాట్లాడుతూ ఈ న్యాయస్థానం 2005వ సంవత్సరం నుండి పనిచేస్తుందని, ఇప్పటివరకు 7866 సమస్యలు పరిష్కరించామని, 5 లక్షల 55 వేల 50 రూ. నష్టపరిహారంగా వినియోగదారులకు చెల్లించడం జరిగిందని, ప్రస్తుతం 139 కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. 2023 వ సంవత్సరంలో 325 కేసులు విద్యుత్ వినియోగదారులకు అనుకూలంగా తీర్పులు వచ్చాయని, ఆ తీర్పుల కాపీలను వినియోగదారులకు పోస్టు ద్వారా మరియు విద్యుత్ శాఖ ద్వారా అందజేశామని పేర్కొన్నారు. ఈసిజిఆర్ఎఫ్ పరిధిలో ఉమ్మడి 5 జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వరకు ఉందని, ప్రతినెల ప్రతి జిల్లాలో క్యాంపు కోర్టు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. నేడు జరిగిన సదస్సులో వివిధ సమస్యలపై విద్యుత్ వినియోగదారుల నుంచి మూడు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ టెక్నికల్ డిఈ వివిఎస్ సాయిబాబా, పాడేరు డిఈ ఎన్ అప్పారావు, చింతపల్లి ఏడిఈ సూర్య ప్రకాష్, చింతపల్లి, జి మాడుగుల, కొయ్యూరు ఏఈలు వీ ప్రభాకర్‌రావు, ఎంవి రమణ, కె నాగేశ్వరరావు, ఆ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- గిన్నెలకోట పంచాయతి ఫరిధిలో రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు

- రెండు రోజుల్లో రేషన్ సరఫరా జరగాల్సిందే

- కలెక్టర్ ఎం. విజయ సునీత



విశాలాంధ్ర-పెదబయలు: పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలలో శనివారం పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆయా గ్రామాలను కలుపుతూ సుమారు ఎనిమిది కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ముందు ఆయా గ్రామస్తులు రహదారి కోసం సమర్పించిన ఫిర్యాదు నేపథ్యంలో శనివారం ఆయా గ్రామాలను సందర్శించి గ్రామస్థులతో పలు విషయాలు చర్చించారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు అక్కడి చెక్ డ్యాం పరిశీలించి వెంటనే మరమ్మత్తులకు అంచనాలు తయారు చేయాలని, అదనపు చెక్ డ్యాం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా త్రాగు నీటి సమస్య ఉందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన చర్యల గూర్చి ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులకు సూచనలు జారీ చేసారు. గత నెలలో రేషన్ సరఫరా జరగలేదని, ఈ నెలలో కూడా ఇంతవరకు రేషన్ అందలేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ రెండు రోజుల్లో గ్రామస్తులకు రేషన్ సరఫరా చేసి నివేదిక సమర్పించాలని మండల తహసిల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా తమలం గ్రామంలో ప్రాథమిక పాటశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వారికి అందుతున్న మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులతో ఆరా తీసారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ వెంటనే విద్యార్థులకు పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. అంతకుముందు పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసారు. చికిత్స పొందుతున్న బాలింత తో మాట్లాడి సకాలంలో మందులు వేసుకుంటూ డాక్టర్ల సూచనలు పాటించాలని కోరారు. ఆసుపత్రిలో మందుల రికార్డులు పరిశీలించిన కలెక్టర్ మందుల కొరత లేకుండా చూడాలని, రానున్న వర్షాకాలంలో డయేరియా ప్రబలె అవకాశం ఉన్నందున అందుకు సంబంధించిన అన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ సిరప్, మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

జీపులో పర్యటించిన కలెక్టర్ : గిన్నెలకోట పంచాయతి ఫరిదిలోని తమలం, గబ్బర మామిడి, కురజంగి, కంచురాయి గ్రామాలలో పర్యటనలో భాగంగా సరియాపల్లి నుండి కమలం వరకు సుమారు 03.50 కిలో మీటర్ల మేర రహదారి బాగు లేక కారు వెళ్ళలేని పరిస్థితిలో కలెక్టర్ కారు దిగి ఒక ప్రవేట్ జీపులో ప్రయాణించి తమలం చేరుకున్నారు. తమలంలో సన్నని రాళ్ళ బాటపై అతికష్టం మీద నడక సాగించి గ్రామానికి చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో కూడా జీపులో ప్రయాణించి సరియాపల్లి చేరుకొని అక్కడి నుండి జాముగూడ వెళ్ళారు. జాముగుడ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పిహెచ్ సి వైద్యాధికారి డా. సునీత, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివయ్య, ఇంచార్జ్ ఎంపిడిఓ పూర్ణయ్య, తహసిల్దార్ రాజా మోహన్ రావు , ఎంఇఓ కృష్ణ మూర్తి, గిరిజన సంక్షేమ ఎఇ రాముడు, మండల స్థాయి అధికారులు జాముగూడ సర్పంచ్ అచ్చయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గుట్టు చప్పుడుగా మళ్ళీ మొదలైన రంగురాళ్ల తవ్వకాలు?

చింతపల్లి కేంద్రంగా వ్యాపార లావాదేవీలు

వారం వ్యవధిలో 1.50 కోట్ల వ్యాపారం

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని సిగ్గపల్లి కొండపై రంగురాళ్ల తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి.గత పది రోజులుగా విస్తరంగా వర్షాలు కురవస్తుండడంతో వ్యాపారులు గిరిజనులతో గుర్తుగా తవ్వకాలు చేపడుతున్నారు.లభ్యమైన రంగురాళ్లను చింతపల్లి కేంద్రంగా వ్యాపార లావాదేవీలు జరుపుతున్నారు.ఇలా వారం రోజుల వ్యవధిలో సుమారు 1.50 కోట్ల వ్యాపారం జరిగినట్టు స్థానికంగా ప్రచారం జరుగుతుంది.గూడెం కొత్త వీధి మండలంలోని దామనపల్లి పంచాయతీ పరిధిలోని సిగ్గపల్లి గ్రామానికి సమీపంలో 2000 అడుగుల ఎత్తు కొండపైన అత్యంత విలువైన రంగురాళ్ల లభ్యమవుతున్నాయి,ఇక్కడ పదిహేనేళ్ల కిందట తవ్వకాలు ప్రారంభమై క్యాట్ ఐ పిల్లి కన్ను రకం రంగు లభిస్తుండడం ఇవి మార్కెట్లో అధిక ధర పలకడంతో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టారు.2011లో కొండపై సొరంగాలు తవ్వకాలు జరపడంతో మట్టి పేల్లలు విరిగిపడి తవ్వకాలకు వెళ్ళిన ముగ్గురు గిరిజనులకు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి క్వారీలో తవ్వకాలు నిలిపేయాలని ఆదేశించారు.దీంతో అక్కడ తవ్వకాలు చేపట్టకుండా అటవీశాఖ పోలీస్ అధికారులు క్వారీ మూసివేసి ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి పరిసర గ్రామాలు వారికి అవగాహన కల్పిస్తున్నారు.అయితే ఏటా వారి కళ్లుగప్పి వ్యాపార తవ్వకాలు చేపడుతున్నారు తాజాగా వారం రోజులుగా తవ్వకాలు చేపడుతున్నట్లు ఆ ప్రాంతీయులు తెలిపారు.రెండు గ్రామాలకు చెందిన గిరిజనులతో చింతపల్లి కి చెందిన వ్యాపారి తవ్వకాలు చేయిస్తున్నారని సమాచారం ఈ వారంలో లభ్యమైన ఒక్క రంగు రాయి గిరిజనుల నుంచి ఆ వ్యాపారి 5 లక్షల కొనుగోలు చేసి 75 లక్షలకు విక్రయించినట్లు ప్రచారం జరుగుతుంది.ఈ వారంలో లభ్యమైన రంగురాళ్లలో సుమారు 1.50 కోట్ల మీద వ్యాపారం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.ఈ విషయంపై అటవీశాఖ పెదవలస సెక్షన్ అధికారి నూకరాజుని వివరణ కోరగా తవ్వకాలు విషయం విచారణ చేపడుతున్నామన్నారు తవ్వకాలు జరిగినట్లు వెల్లడైతే అందు కారణమైన వారిని కఠినంగా శిక్షించే చర్యలు తీసుకుంటామన్నారు.

స్టాఫ్ డయేరియాపై అవగాహన



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: డయేరియా నిలుపుదల అనే కార్యక్రమం జూలై 1 నుండి జూలై 14 వరకు రెండు వారాలపాటు జరుగుతుందని,ఈ విషయం పై అందరూ విధులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు.స్టాఫ్ డయేరియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు పార్వతీపురం పట్టణంలో డీసెల్టింగ్ పనులు జరుగు వేళలో సీల్ట్ ను పూర్తి స్థాయిలో తీయించే విధంగా చూసుకోవాలని యాంటీ లార్వా స్ప్రేయింగ్ మీ వార్డు పరిధిలో అన్ని వీధుల్లో జరిగే విధంగా మీతో పాటు ఎ.ఎన్.యం బాధ్యత వహించాలని అలా జరగని యెడల మీ పై తగు చర్యలు శాఖ పరంగా తీసుకుంటామని తెలిపారు.ప్రధాన రహదారి లో ఉన్న దుకాణాలు దగ్గర డస్ట్ బిన్స్ పెట్టించే విధంగా చూసుకోవాలని డస్ట్ బిన్ లు ఏర్పాటు చెయ్యని దుకాణదారులపై అపరాదరుసుం విధించాలని సూచించారు. ఇదే సమయంలో సచివాలయ ఎమినిటి సెక్రటరీ లను ఉద్దేశించి ప్రతిరోజు వార్డుల్లో కుళాయిలు సరఫరా అయ్యే సమయంలో క్లోరినేషన్ టెస్ట్ లు అనేవి చెయ్యాలని వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉండేటట్లు చూడాలని ఏరియా వారిగా కులాయి లీకులను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ మురళి, ఏఎస్ఓ వీరునాయుడు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు, రంపచోడవరం కేంద్రాలుగా 'అన్న' క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటిడిఏ, రంపచోడవరం ఐటీడీఏ కేంద్రాలుగా అన్నా క్యాంటీన్లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూసుదూర ప్రాంతాల నుంచి రంప చోడవరం చింతూరు ఐటీడీఏలలో అనేక పనుల నిమిత్తం ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు వస్తుంటారని, అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం వలన వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఎటపాక, కూనవరం, విఆర్ పురం సుదూర ప్రాంతాల నుంచి రంపచోడవరం చింతూరు వెళ్తున్న ప్రజలకి ఈ అన్నా క్యాంటీన్‌ల ద్వారా కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అన్నారు. తక్షణమే రంపచోడవరం చింతూరు కేంద్రాలుగా ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలు

విశాలాంధ్ర-ఎటపాక: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఎటపాక లోగల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫీస్ నందు మాజీ ఎంపీటీసీ నిడదవోలు సూర్యనారాయణ చౌదరి ,సబ్ ఇన్స్పెక్టర్ ఆఫీస్ నందు మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు, ఎటపాక సచివాలయం నందు సీనియర్ నాయకులు పార్టీ చలపతిరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరరావు ఎటపాక మండల వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, జిల్లా తెలుగు యువత నాయకులు నలజాల శ్రీకాంత్ పాటి సంపత్ ఐటిడిపి క్లస్టర్ ఇంచార్జ్ బాచినేని శ్రీకాంత్ సీనియర్ నాయకులు ఆకుల కొండలరావు ముప్పాల చిన్న వీర వెంకయ్య సరిహద్దు వెంకన్న వార్డు మెంబర్ అలవాల వెంకటరావు మాణికుల వీరస్వామి పాలడుగు నవీన్ ఏసుపాక వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం సప్పర్ల ఘాట్ రోడ్డులో శనివారం తెల్లవారుజామున ఖాళీ ఆయిల్ ట్యాంకర్ అదుపు తప్పింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హెచ్‌పిసిఎల్ కంపెనీకి చెందిన ఆయిల్ ట్యాంకర్ విశాఖపట్నం నుంచి సీలేరు జీసీసీ బంక్‌కు శుక్రవారం ఆయిల్ తీసుకొచ్చి బంక్‌లో అన్‌లోడ్ చేసి శనివారం తెల్లవారుజామున విశాఖపట్నం వెళ్తండగా మార్గంమధ్యలోని సప్పర్ల రేయిన్ గేజ్ సప్పర్ల వద్ద ఘాట్ దిగుతూ ట్యాంకర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పింది. అయితే ప్రమాదం జరిగిన ప్రాంతంలో లోయ ప్రాంతం కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.